రెండు పవర్ బోర్‌ల ఏర్పాటు



బోర్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్ గౌడ్

ముషీరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిధులతో ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు రెండు పవర్‌బోర్‌లు ఏర్పాటు చేసినట్టు కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని మొరంబొంద, నెయ్యియొళ్లగల్లీలలో పవర్‌బోరు నిర్మాణ పనులు కార్పొరేటర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ఉండడం వల్ల బోర్ ఏర్పాటులో జాప్యం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జమాల్‌పురి నందు, డివిజన్ అధ్యక్షుడు బద్రినారాయణ, నాయకులు శ్రీహరి, వాసు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వెంకటాచారి, మదన్‌మోహన్, కృష్ణమాచారి తదితరులు

విశ్వకర్మలను ప్రభుత్వం ఆదుకోవాలి

బర్కత్‌పుర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలలో వివక్షతకు గురైన విశ్వకర్మలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం విజ్ఞప్తి చేసింది. శనివారం బీసీ సాధికారిక భవన్‌లో పలు విశ్వకర్మ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి చోల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి మాట్లాడారు. రాష్ట్రంలో సరైన ఉపాధి లేక దాదాపు 900 మంది విశ్వకర్మీయులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. సమావేశంలో మనుమయ సంఘం ప్రధాన కార్యదర్శి రాళ్లబండి విష్ణుచారి, రాష్ట్ర స్వర్ణకార సంఘం గౌరవ సలహాదారు ఎర్రోజు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంటలో అభివృద్ధి పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులపై చర్చిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని పలు ప్రాంతాలలో రూ.70 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ యాకర అమృత వెల్లడించారు. ఈ మేరకు శనివారం డివిజన్‌లో బాయమ్మ గల్లీ, తిలక్‌నగర్ తదితర ప్రాంతాలలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

మహిళాసాధికారతే వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ లక్ష్యం



సుధాకర్‌గుప్తాను అభినందిస్తున్న రవిచంద్రన్

బర్కత్‌పుర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, మహిళాసాధికారత, ఆర్యవైశ్యుల ఐక్యత వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ లక్ష్యమని ఆ సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు రవి చంద్రన్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 14 దేశాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శనివారం కాచిగూడ డివిజన్‌కు చెందిన మ్యాడం సుధాకర్‌గుప్తా, వాసవీ క్లబ్ గ్రేటర్ 26వ అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆయనను అభినందిస్తూ మాట్లాడారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తున్న ఘనత ఆర్యవైశ్యులకు దక్కుతుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ



కార్యక్రమంలో కవిత తదితరులు

చిక్కడపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం గురించి జీర్ణించుకోలేని బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని మహిళా కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షురాలు పుస్తకాల కవిత ఆరోపించారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో శనివారం జూబ్లీబస్ స్టేషన్‌లో నిర్వహించిన మహాలక్ష్మి పథకంపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు వినియోగించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జయమ్మ, ఉషశ్రీ, సుల్తానా, ప్రీతి, కవిత, అనురాధ, ఉష, రమణ తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథ్, శ్యామకృష్ణను సత్కరిస్తున్న అతిథులు

రంజింపచేసే బాలమురళీ గానం

చిక్కడపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మంగళంపల్లి బాలమురళీకృష్ణ గానం రంజింపచేస్తుందని ప్రముఖ గాయకులు కొనియాడారు. బుర్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటి, శ్రీరాగ సినీ మ్యూజికల్ ఆర్కెస్ట్రా ఇరవై ఐదు సంవత్సరాల సందర్భంగా శనివారం త్యాగరాయగానసభలో డీవీవీఎస్ నారాయణ సంకలనం చేసిన సంగీత స్వరనిధి బాలమురళి సంపుటిని ప్రముఖ గాయకుడు త్రినాథరావు, మాజీ విద్యాధికారి పల్లా సోమసుందరశర్మ, అన్నమయ్య సంకీర్తనల పరిశోధకుడు నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అణు శాస్త్రవేత్త విశ్వనాథ్‌మద్దిపట్ల, గాయకుడు నేదునూరి శ్యామకృష్ణను గాన కళా భూషణ బిరుదుతో సత్కరించారు. విశ్వనాథ్ అణుశాస్త్ర నిపుణులు మాత్రమే కాకుండా సినీపాటలపై పరిజ్ఞానం ఉన్న గాయకుడని అభినందించారు. అలివేలు, లక్ష్మి, శ్యామకృష్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కవాడిగూడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ ఎస్ఐ నాగరాజు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఎల్ఐసీ కార్యాలయం పక్కన గాంధీ దవాఖానకు ఎదురుగా ఉన్న 1038 హెచ్ఎం ఆర్ పిల్లర్ సమీపంలో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు దాదాపు 45 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. మృతుడి ఒంటిపై బూడిదరంగు చొక్కా, మిశ్రమ రంగు బెడ్‌షీట్ ఉందని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆసుపత్రిలో భద్రపర్చినట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



యువకుడి మృతదేహం

బర్కత్‌పుర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలోని మలకపేట రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందాడని సీఐ ఎల్లప్ప తెలిపారు. స్టేషన్‌లోని 2వ ప్లాట్‌ఫారం వద్ద 35 ఏళ్ల వయసు గల యువకుడు మృతిచెంది ఉన్నట్లు ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే మృతి చెందిన యువకుడి వీపుపై గాయాలు ఉండడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా చంపి ప్లాట్‌ఫారంపై పడివేశారా లేక వేరే ప్రాంతంలో ఇక్కడికి తీసుకువచ్చారా అనే దానిపై విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నామని తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు వెంటనే కాచిగూడ రైల్వే పీఎస్‌లో గానీ, 8712658584లో గానీ సీఐ కోరారు.

జర్నలిస్టుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం

రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మామిడి సోమయ్య తదితరులు

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, దీర్ఘకాలంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు కోరారని, ప్రధానంగా ఇళ్ల స్థలాల సమస్యను గత ప్రభుత్వం పరిష్కరించకుండా పదేళ్లుగా జాప్యం చేసిందని తెలిపారన్నారు. శనివారం జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు పులిపలుపుల ఆనందం, తన్నీరు శ్రీనివాస్, కార్యదర్శి ఇ.చంద్రశేఖర్, నాయకులు కె.పాండురంగారావు, జె.ఉదయభాస్కర్‌రెడ్డి, యర్రమిల్లి రామారావు తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. జర్నలిస్టులకు గతంలో మూడు సార్లు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తుందన్న నమ్మకం ఉందని వారు మంత్రికి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అనేక మంది జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల పెట్టారని, అలాంటి జరగకుండా నిరోధించాలని, రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీలు వేయాలని కోరారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన విషయం వాస్తవమేనని, వారి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పంట ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం నాయకులు

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల విధానం ద్వారా పండించి ఉత్పత్తులను రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి, అధ్యక్షుడు డి.వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి జి.కృపాకర్‌రెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రైతులకు అధికారులు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం ద్వారా రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయిలో రూపొందించిన ప్రణాళికలను, వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి వ్యవసాయ విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులను చైతన్యపరచాలని సూచించారు. ఇటీవల జరిగిన వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గం సభ్యులను నాయకులు మంత్రికి పరిచయంచేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ వి.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఫుల్ మెనీ ఏ జెమ్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సజ్జనార్ తదితరులు

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కన్నడ, తెలుగు సంస్కృతుల మధ్య సాన్నిహిత్యం ఉందని టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ. సజ్జనార్ అన్నారు. అందుకే ఇక్కడి సంప్రదాయాలు పాటిస్తూ సోదరభావంతో కన్నడిగులు నివసిస్తున్నారన్నారు. కన్నడ నాట్యరంగం ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అద్భుత రామాయణ తోలు బొమ్మలాట ప్రదర్శనతోపాటు ఫుల్ మెనీ ఏ జెమ్ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన నాటక రంగంపై నిరంజన్‌రావు రాసిన ఫుల్ మెనీ ఏ జెమ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రజనీ గరుడ దర్శకత్వం వహించిన అద్భుత రామాయణ తోలుబొమ్మలాట వీక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ నాటక రంగ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, బీఆర్‌రావు, ఉపాధ్యక్షులు రత్నాకర్‌రాయ్, కర్నాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు విఠల్‌జోషి, కన్నడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ధర్మేంద్రపూజారి, పుస్తకరచయిత నిరంజన్‌రావు పాల్గొన్నారు.

ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలు రద్దు చేయాలి

ఎస్‌డబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి డిమాండ్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో తక్షణం సంక్షేమ మండళ్లను రద్దు చేయాలని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి బీ.అబ్రహం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం నుంచి దిగి పోయి కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టినప్పటికీ ఆర్టీసీలో అధికారుల పనితీరులో మార్పురాకపోవడం ఆశ్చర్యంగా ఉందని, కార్మికుల పట్ల మునుపటి లాగే బెదిరింపులు-వేధింపులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని ఎన్నో కష్ట నష్టాలకుగురవుతున్నప్పటికీ కార్మికులు విజయవంతంగా అమలు చేస్తున్నారని వివరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా దాటవేయడానికై బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ మండళ్లను (వెల్ఫేర్ కమిటీ) రద్దు చేసి యూనియన్‌ల కార్యకలాపాలకు అనుమతించాలని కోరారు. వన భోజనాలకు వినియోగించే నిధులను ఆయా డిపోల్లో ఉద్యోగులు, ప్రధానంగా మహిళా ఉద్యోగులకు అవసరమైన రెస్ట్‌రూం సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

సిటీ టు హంపీ కార్ల ర్యాలీ

'రోటరీ' ఆధ్వర్యంలో..



కారుపై గిటార్ వాయిస్తూ చేస్తున్న క్లబ్ సభ్యులు

రాజేంద్రనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర్ రావు(సీఆర్) ఫౌండేషన్‌లో డయగ్నోసిస్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు నిధుల సేకరణ కోసం రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో శనివారం కార్ ర్యాలీ నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఉప్పర్‌పల్లి సోలిటర్ ఇంటర్నేషనల్ హైస్కూల్ నుంచి కర్ణాటకలోని హంపీ వరకు 364 కిలోమీటర్లు ఈ ర్యాలీ సాగనుంది. 20 కార్లలో వంద మంది సభ్యులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో కార్ల వేగం 45 కిలోమీటర్లు మించకుండా ఉంటుంది. కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, వాట్సాప్ చాటింగ్ చేస్తు కార్లు నడపవద్దని, అతివేగంతో కార్లు నడపవద్దని, మద్యం సేవించి కార్లు నడపవద్దనే సందేశాలు ఇస్తూ ర్యాలీ సాగుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ అధ్యక్షుడు అనిల్ రాంచందానీ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మీర్ ముర్తుజా అలీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్ బిందాల్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా.. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. తర్వాత అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



ఇరుముడి పూజలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, నాగేష్ ముదిరాజ్

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

కవాడిగూడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక భావనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ హనుమాన్ దేవాలయంలో అయ్యప్ప భక్తుడు గడ్డె శ్రీనివాస్ ఆధ్వర్యంలో శబరిమలకు వెళ్తున్న సందర్భంగా ప్రత్యేక పూజలు, ఇరుముడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయయకులు ఎం నాగేష్ ముదిరాజ్, బీజేపీ ఓబీసీమోర్చా జాతీయ కార్యవర్గసభ్యులు పూస రాజు, జి వెంకటేష్, డివిజన్ అధ్యక్షకార్యదర్శులు ఎంసి మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, జి కేశవరాజు పాల్గొన్నారు.



దాసు సురేష్‌ను సన్మానిస్తున్న బోనం ఊర్మిళ

బీసీలు రాజ్యాధికార దిశగా ముందుకు సాగాలి

చిక్కడపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజ్యాధికారదిశగా ముందుకు సాగాలని బీసీరాజ్యాధికారి సమితి అధ్యక్షుడు దాసు సురేష్ పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు బోనం ఊర్మిళ ఆధ్వర్యంలో శనివారం దాసు సురేష్‌ను గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో నూతన సంవత్సరం సందర్భంగా సన్మానించారు. దాసు సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికశాత జనాభాఉన్న బీసీలు సమైక్యంగానిలిచి రాజ్యాధికారాన్ని సాధించుకున్నప్పుడే బీసీల అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. బన్ని, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఛే నెంబర్ చౌరస్తా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

ఫ్లై ఓవర్ పనులు వేగవంతం చేయాలి

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని ఛే నెంబర్ చౌరస్తాలో నిర్వహిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరలో ఉపయోగంలోకి తేవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. శనివారం బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల స్థానిక వ్యాపారులు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు.

బీసీలకు ఎమ్మెల్సీ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలుగా అవకాశం దక్కని బీసీలకు ఎమ్మెల్సీ ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ కోరారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సమితి కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం బీసీ నాయకులు పాటుపడ్డారని వారికి ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలన్నారు. బీసీల అభివృద్ధి, సంక్షేమం చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ సంఘాల నాయకులు తాడూరి శ్రీనివాస్, గుజ్జ కృష్ణ, ఊర్మిళ, పద్మావతి, ఉదయ్ పాల్గొన్నారు.

యువత ఇతరులకు ఉపాధి కల్పించాలి

ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ



జ్యోతి వెలిగించి గ్రాడ్యుయేషన్ వేడుకలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో విద్యారంగంలో వస్తున్న శాస్త్ర, సాంకేతికతను నేటి విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంతో పాటు ఇతరులకు ఉపాధి అందించే దిశగా ఎదగాలని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో అబిడ్స్‌లోని మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ గ్రాడ్యుయేషన్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో మెథడిస్ట్ కళాశాల అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సు పూర్తయ్యే సమయంలో ఉద్యోగంతోనే బయటకు వెళ్లేలా కష్టపడాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి రాములు, కళాశాల చైర్మన్ కృష్ణారావు, డైరెక్టర్లు ప్రదీప్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీపతిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు బెనకోప్, కన్వీనర్ డాక్టర్ వై.మస్తానయ్య, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నరేంద్రనాథ్, పీఆర్‌వో శ్రీకాంత్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యత కోసం వనభోజనాలు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ అభివృద్ధి, కార్మికుల ఐక్యత, స్నేహభావం, ఉత్సాహం నింపడానికి ఎండీ సజ్జనార్ చేపట్టిన వనభోజనాల కార్యక్రమం దోహదపడతాయని ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం ఆజామాబాద్‌లోని ముషీరాబాద్ డిపోలో నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి ఆయన హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు యాజమాన్య నిర్ణయాలను గౌరవించి సంస్థ అభివృద్ధికోసం పాటుపడాలని సూచించారు. ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న ఉచిత బస్సు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డ్రైవర్లు, కండక్టర్లు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం విజయభాను కార్మికులకు భోజనాలు వడ్డించి వనభోజనాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ మేనేజర్ వరప్రసాద్, చార్మినార్ డిప్యూటీ రీజియన్ మేనేజర్ జగన్, ముషీరాబాద్ డిపో మేనేజర్ కిషన్‌రావు, అధికారులు సీసా నర్సయ్యగౌడ్ తోపాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లకు రక్షణ కల్పించండి

నూతన చట్టంలోని సెక్షన్ 104 (2) రద్దు చేయాలి

హైదరాబాద్ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఐపీసీ స్థానంలో తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత్ చట్టంలో సెక్షన్ 104 (2)ను రద్దుచేయాలని, రవాణా రంగాన్ని కాపాడాలని, డ్రైవర్లకు రక్షణ కల్పించాలని టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ డిమాండ్ చేసింది. ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ముషీరాబాద్‌లోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన దినం పాటించారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఎస్‌డబ్ల్యూ నాయకులు ఏపీ రావు, గంగాధర్, బిక్షపతి గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్పందించి చట్టంలో మార్పులు చేయకపోతే దేశవ్యాప్త సమ్మెకైనా సిద్ధంగా ఉండాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బీఎన్ఎస్ఎ చట్టంలో మార్పులు కోసం దేశవ్యాప్తంగా పోరాటానికి ముందుకు రావాలని, రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మిక సంఘాలకు ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ అఖిల భారత కేంద్రం లేఖలు రాసిందని, కార్మికుల ప్రయోజనం కోసం అందరు ముందుకు రావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో రవాణా రంగ కార్మికుల సమస్యలు రాజకీయ ఎజెండా అయ్యేలా కార్మికులు ఆందోళన, పోరాటాలు నిర్వహించాలని సూచించారు.



పేదలకు అల్పాహారం పంపిణీ

కందూరి కృష్ణ ఫౌండేషన్, సేఠ్ మాణిక్‌లాల్ అగర్వాల్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలో పేదలకు అల్పాహారం, పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కందూరి కృష్ణ ఫౌండేషన్ చైర్మన్ కందూరి కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ అగర్వాల్, కందూరి కౌశిక్, గోవిందరావు, జ్వలవరాలిణి, డాక్టర్ సంగీత పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

ముగిసిన ప్రజాపాలన



భరత్‌నగర్ సెంటర్‌ను సందర్శించిన వీహెచ్, డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి తదితరులు

బర్కత్‌పుర/నల్లకుంట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారెంటీల పథకానికి అంబర్‌పేట జీహెచ్ఎంసీ-16 సర్కిల్ పరిధిలోని ఆరు మున్సిపల్ డివిజన్ల నుంచి మంచి స్పందన లభించింది. గత నెల 28న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా శనివారంతో ముగిసింది. శనివారం సర్కిల్ పరిధిలో 9,425 మంది దరఖాస్తు చేసుకున్నారు. 8 రోజులుగా స్వీకరించిన మొత్తం దరఖాస్తులు 84,172 కాగా వాటిలో అభయహస్తం కింద 63,891, ఇతర దరఖాస్తులు 21,055 స్వీకరించామని డీఎంసీ మారుతిదివాకర్ తెలిపారు. హెల్ సెంటర్‌ను మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు సి.రోహిణ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులిజగన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ముషీరాబాద్ పరిధిలో 76,674 దరఖాస్తులు

రాంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాపాలన శనివారంతో ముగిసింది. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో 76,674 దరఖాస్తులు స్వీకరించినట్లు డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. సర్కిల్ పరిధిలో దరఖాస్తుల స్వీకరణకు 25 కేంద్రాలు ఏర్పాటు చేసి ఆరు గ్యారంటీల దరఖాస్తులకు సంబంధించి 59,907తో పాటు ఇతర దరఖాస్తులు 16,767 వచ్చాయని తెలిపారు.

● **చిక్కడపల్లి:** ప్రజాపాలనను నిరంతర ప్రక్రియగా ప్రభుత్వం చేపట్టాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆమె చిక్కడపల్లిలోని వార్డు కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ర, సిబ్బందితో మాట్లాడి దరఖాస్తుల గురించి ఆరా తీశారు.